క్లుప్తంగా

మెగా కంటి వైద్య శిబిరం



నగరంలో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణులు

మామిడికుదురు: నగరం గ్రామ పంచాయతీ వద్ద సోమవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు. అనుగ్రహ దృష్టిదాన్ సంస్థ, డీవైన్ ఐ ఫౌండేషన్ పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ చీఫ్ మేనేజర్ సంజయ్ ఉజ్వల్, గ్రామస్తులు జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్, ముఖరం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి



పి.గన్నవరం సీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్ యు.రాఘవేంద్రరావు అధ్యక్షతన సోమవారం జరిగిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన కోట రాజేంద్రప్రసాద్, గుడాల సంపతరావు, పితాని నాగమణిలను ఎమ్మెల్యేతో పాటు, ఆస్పత్రి వైద్య సిబ్బంది అభినందించారు. ఎంపీడీఓ కేవీ ప్రసాద్, డాక్టర్లు అప్పారి సూర్యనారాయణ, కోటేశ్వరరావు, సంధ్యారాణి, హెచ్ఎస్ అనంత కుమారి, సీనియర్ అసిస్టెంట్ పల్లవి, సీహెచ్ మణితేజ, పంచాయతీ కార్యదర్శి నిమ్మకాయల వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



రాజోలు తహసీల్దారు, వీఆర్వోలను సత్కరించిన రెవెన్యూ సిబ్బంది

రాజోలు: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌ను సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. అలాగే ఈ నెల 25న ఓటర్స్ డే సందర్భంగా బెస్ట్ బీఎల్వోగా స్టేట్ అవార్డు విజయవాడలో ఎలక్షన్ కమిషన్ ద్వారా తీసుకున్న బి.సావరం వీఆర్వో రాజ్ తరుణ్‌ను కూడా సత్కరించారు.

మాజీ మంత్రి గొల్లపల్లి పరామర్శ

మామిడికుదురు: మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సోమవారం మామిడికుదురులో పలువురిని పరామర్శించారు. రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత నయినాల నాగమణిభద్రరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో నాగమణిభద్రరావు చిత్రపటం వద్ద సూర్యారావు పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అతని కుమారుడు బాల సంజీవ్‌ను పరామర్శించారు. పితృ వియోగంతో బాధపడుతున్న యన్నా బత్తుల ప్రసాద్‌ను పరామర్శించారు. ప్రసాద్ తండ్రి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. మామిడికుదురుకు చెందిన పార్టీ సీనియర్ నేత కంచి పెంటయ్యను కలిసి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. మాజీ మంత్రి వెంట వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య కుమార్, పార్టీ నేతలు నయినాల రామకృష్ణ, పినిశెట్టి నాగబాబు, కంచి శ్రీరామ్, చేగొంగి లక్ష్మీనారాయణ ఉన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

రాజోలు: తాగునీటి చెరువులో పడి తాటిపాక గ్రామానికి చెందిన యువకుడు గుమ్మడి కుమారస్వామి(35) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి మేనమామ సారిక వెంకట శ్రీనివాసరావు రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమారస్వామి, అతని తల్లిదండ్రులు వరలక్ష్మి, నాగరాజు ఉపాధి నిమిత్తం హైదరాబాదులో ఉంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండగ నిమిత్తం వారు స్వగ్రామం తాటిపాక వచ్చారు. తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లిపోగా కుమారస్వామి తాటిపాకలోనే ఉండిపోయాడు. అయితే ఈ నెల 25వ తేదీ నుంచి కుమారస్వామి కనిపించడం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో చెత్త సమస్య

- ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త
- డంపింగ్ యార్డులుగా రోడ్లు, కాలువలు
- నామమాత్రంగా తడి, పొడి చెత్త సేకరణ
- నిరుపయోగంగా వర్మీ కంపోస్టు యార్డులు



కొత్తపేట బ్యాంకు కాలనీ సమీపంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

కొత్తపేట: నగరాలు, పట్టణాల్లోనే కాదు పల్లెల్లో కూడా చెత్త ప్రధాన సమస్యగా మారింది. ఇది పాలకులకు అధికారులకు నిద్ర లేకుండా చేస్తోంది. ప్లాస్టిక్, ఇతర వస్తువుల వినియోగం పెరిగే కొద్దీ చెత్త కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. చాలా పంచాయతీలకు డంపింగ్ యార్డులు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తను గ్రామ శివారులోనూ, రోడ్లపై, పంట, మురుగునీటి కాలువల వెంబడి డంప్ చేస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 57 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో 20 మేజర్ పంచాయతీలు ఉన్నాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 75 పంచాయతీలు కాగా 19 మేజర్ పంచాయతీలున్నాయి. రాజోలు నియోజకవర్గంలో 60 పంచాయతీల్లో 16 మేజర్ పంచాయతీలున్నాయి. మేజర్ పంచాయతీల్లో సుమారు 20 వేల మంది వరకు జనాభా ఉన్నారు. మేజర్ పంచాయతీల్లో సగటున రోజుకు రెండు టన్నుల నుంచి ఐదు టన్నుల వరకు చెత్త వస్తోందని అంచనా. ఇక్కడ డంపింగ్ యార్డుల సమస్య అధికంగా ఉంది. సొంతంగా డంపింగ్ యార్డులున్న పంచాయతీల సంఖ్యను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. మురుగు, పంట కాలువల చెంతన, గోదావరి గట్ల మీద, రోడ్ల వెంబడి, గ్రామ శివారుల్లో కాలనీలు, పాఠశాలలు, వసతి గృహాల చెంతన సైతం చెత్తను వదిలేస్తున్నారు. ఇదే ఒక్కొక్కసారి గ్రామాల్లో వివాదాలకు, ఘర్షణలకు దారితీస్తోంది. దీనివల్ల తాము రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన పడుతున్నారు. వస్తున్న చెత్తలో సుమారు 50 శాతం ప్లాస్టిక్ కావడంతో కుళ్లిపోయే అవకాశం లేదు. దీనితో వాటిని తగులబెట్టడం వల్ల ప్రజల ఆరోగ్యానికి మరింత ముప్పుగా మారుతోంది.

వర్మీ కంపోస్టు యార్డులను పట్టించుకోక..

గ్రామ పంచాయతీల్లో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేసి ఆదాయ వనరులను పెంచుకోవాలనే లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పలు గ్రామాల్లో హడావుడిగా షెడ్లు నిర్మించి చేతులు దులుపేసుకుంది. తదనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తూ అపారిశుధ్య నిర్మూలనకు పెద్దపీట వేసింది. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడిచెత్త విడివిడిగా సేకరించడానికి చర్యలు తీసుకుంది. తడి చెత్త, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా రెండు బుట్టలను కూడా ప్రతి ఇంటికీ అందజేసింది. అలాగే గ్రీన్ ఆర్మీ వాహనాలను చెత్త తరలించేందుకు ప్రతి పంచాయతీకి కేటాయించింది. అయితే అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ పాలకవర్గాలున్న పంచాయతీల్లో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోలేదు. పలు పంచాయతీల్లో అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్టు పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన అనేక వర్మీ కంపోస్టు యార్డు షెడ్డులు నిరుపయోగంగా అలంకార ప్రాయంగా మిగిలాయి.

చెత్త సేకరణ శూన్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెత్త సేకరణను పట్టించుకోవడంలేదు. గ్రామాల్లో శివారు రోడ్లన్నీ చెత్తతోనే దర్శనమిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు యార్డులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించా డంపింగ్ యార్డుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాపోతున్నారు.

> **ఫిబ్రవరి నుంచి వర్మీ కంపోస్టు తయారీ**
>
> 
>
> అన్ని పంచాయతీల్లో వర్మీ కంపోస్టు తయారీకి ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం ఫిబ్రవరి నుంచి అన్ని షెడ్డుల్లో వర్మీ కంపోస్టు తయారు చేయిస్తాం. ఉపాధి హామీ కూలీలకు పనికల్పిస్తాం. కూలీలకు వంద రోజులు పని కల్పించి, వర్మీ కంపోస్టు యార్డులను వినియోగంలోకి తీసుకువస్తాం. మండలంలోని 10 పంచాయతీలకు 7 పంచాయతీలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు ఉన్నాయి. వాడపాలెంలో షెడ్డు పూర్తి కావడంతో కొత్తపేట, మందపల్లి గ్రామాల్లో స్థల సమస్య ఉంది. స్థల సేకరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక డంపింగ్ యార్డులు సమస్యను డీపీఓ దృష్టికి తీసుకువెళ్లాం.
>
> – డి.సుబ్బారావు, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ, కొత్తపేట

30 నుంచి నీలకంఠేశ్వరుని కల్యాణోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో కొలువై ఉన్న పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్టు సదరు దేవస్థానం సోమవారం తెలిపింది. మహోత్సవాల్లో భాగంగా 30వ తేదీన అంకురార్పణ, 31వ తేదీన రాత్రి నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం పేర్కొంది.

కల్లుగీత కార్మికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆలమూరు, మండపేట రూరల్, టౌన్, కపిలేశ్వరపురం మండలాలకు సంబంధించి కల్లుగీత కార్మికులకు మూడు మద్యం దుకాణాలను కేటాయించినట్టు సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు మూడు మద్యం దుకాణాలను ఒక్కొక్కటి చొప్పున శెట్టిబలిజ కులస్తులకు కేటాయించినట్టు తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల ఫిబ్రవరి ఐదో తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆరున దరఖాస్తులను పరిశీలించి, ఏడున అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీయనున్నట్టు తెలిపారు. కల్లుగీత కార్మికుడు సంబంధిత కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రూ రెండు లక్షల నాన్ రిఫండబుల్ డీడీతో స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రందించాలని సీఐ నాగేశ్వరరావు కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి



సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గొల్లపల్లి

- పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు
- వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ సమావేశం

మలికిపురం: ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గొల్లపాలెం గ్రామంలో సోమవారం వైఎస్సార్ సీపీ సమావేశం జరిగింది. నూతన గ్రామ శాఖ అధ్యక్షుడు తాడి కాశీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. మామిడికుదురు మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, నాయకులు సూరిశెట్టి బాబి, తాడి సహదేవ్, పితాని శ్రీనివాసరావు, వడ్డి చిన్ని, నల్లి విజయ్ ప్రసాద్, గుండుమేను నారాయణమూర్తి, గుండుమేను సత్యనారాయణ, గంటా ప్రభాకర్, దొంగ వెంకన్నబాబు, మహిళా ప్రతినిధులు పి.శోభన, ఎం.నాగేశ్వరీ, జి.అరుణకుమారి, ఎస్.సుజి, కృష్ణకుమారి, సుజాత పాల్గొన్నారు.

కిశోర వికాసమే లక్ష్యం

- సీడీపీఓ గజలక్ష్మి, ఎంపీడీఓ నరేష్‌కుమార్
- గ్రామ స్థాయి కమిటీలకు శిక్షణ



కొత్తపేట మండల శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ గజలక్ష్మి

కొత్తపేట: గ్రామ, మండల స్థాయిలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయడం ద్వారా 'కిశోరి వికాసం' లక్ష్యం నెరవేర్చాలని స్థానిక ఇన్‌చార్జి సీడీపీఓ ఏ గజలక్ష్మి, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో 'కిశోరి వికాసం'పై గ్రామ కమిటీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ గజలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరూష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ముఖ్యంగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు గ్రామ, మండల స్థాయిల్లో కూడా నిర్వహించి అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే గ్రామ, మండల స్థాయిల్లో ఉన్న కమిటీలను బలోపేతం చేసేందుకు తరచూ సమావేశాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన స్టేట్ రిసోర్స్ సభ్యులు అవగాహన కల్పిస్తూ 11–18 సంవత్సరాల బాలబాలికలకు, పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రుతుస్రావం, బాల్య వివాహాలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వానపల్లి, అవిడి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ ఎస్ నిమారిక, పీ రవికుమార్, జెడ్పీహెచ్ఎస్ పీడీ వైఎస్ఎస్ ఉషారాణి, జీఎల్ సుజాత, పార ప్రతినిధి ఎస్.ఇస్పై, గ్రామ స్థాయి కమిటీల సభ్యులైన స్కూల్ టీచర్స్, ఏఎస్ఎంలు, జీఎంఎస్‌కే, వెల్ఫేర్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షం

ఘనంగా మందకృష్ణకు 'పద్మశ్రీ' ప్రదానోత్సవం



మెర్లపాలెంలో మందకృష్ణ పద్మశ్రీ ప్రదానోత్సవం జరుపుకొంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తపేట: ఎస్సీ వర్గీకరణ పోరాటయోధుడు మంద కృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ, ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆనందోత్సాహాలతో గ్రామంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్దకు చేరుకుని ఆ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవ, యాకోబు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ నేత మందకృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం మాదిగ జాతికి ఎంతో గర్వ కారణమన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం



ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్

మామిడికుదురు: బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం పేదలకు అండగా నిలుస్తోందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. సంఘం అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అభినందించారు. మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 28వ వార్షికోత్సవ సభ మామిడికుదురు బీసీ సామాజిక భవనంలో జరిగింది. సభకు మండల శాఖ అధ్యక్షుడు నైనాల రఘురామయ్య అధ్యక్షత వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన బీసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు అందించి వారిని షీల్డులు అందజేశారు. ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ వంటి సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వీర వెంకటేశ్వరరావు, జిల్లా ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల ర్యాలీ



మామిడికుదురులో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్స్

రాజోలు: జాతీయ ఎలక్ట్రీషియన్స్ డేను పురస్కరించుకుని రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం మండలాలకు చెందిన ఎలక్ట్రీషియన్లు సోమవారం మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనవదుర్గా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆరో వార్షికోత్సవ సభ జరిగింది. స్థానిక వాడ్రేవుపల్లి జంక్షన్ నుంచి తాటిపాక సెంటరు మీదుగా రాజోలు, విశ్వేశ్వరాయపురం చేరుకుని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు తమ సమస్యల పరిష్కారం చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. భవన నిర్మాణ రంగంలో కీలకంగా ఉండే ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పనిముట్లు అందిచాలని, ప్రతి మండలానికి సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రమాదాల కారణంగా మృతి చెందిన కార్మికులకు రూ.10 లక్షల పరిహారం అందించాలని కోరారు. సంఘ అధ్యక్షుడు మెడబల రామారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్దనరావు, కోశాధికారి మామిడిశెట్టి సత్యనారాయణ, నాయకులు కట్టా రాంబాబు, చిట్టూరి సురేష్, యాండ్ర నారాయణమూర్తి, గంటే రామారావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం మండలాలకు చెందిన శ్రీనవదుర్గ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి మండలానికి ఒక సర్వీసు సెంటర్‌ను ఏర్పాటు చేసి వారికి వృత్తి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు మెడబాల రామారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్థనరావు, కోశాధికారి మామిడిశెట్టి సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు కట్టా రాంబాబు చిట్టూరి సురేష్, యాండ్ర నారాయణ మూర్తి, గంటే రామారావు, పితాని శ్రీనివాసరావు, యన్నాబత్తుల బాలచంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో సోమవారం నేషనల్ ఎలక్ట్రికల్ డే ఘనంగా జరిగింది. మండల శ్రీశివశక్తి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ రివైండింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ మురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజవర్గ రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు హాజరయ్యారు. . తొలుత ఎలక్ట్రికల్ బల్బును కనుగొన్న థామస్ హల్వా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండే రామకృష్ణ, వేమగిరి శ్యామ్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏడీఏ పురస్కార గ్రహీత రామారావుకు అభినందనలు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఏడీఏ వెంకటరామారావు

కొత్తపేట: వ్యవసాయ శాఖలో జిల్లా స్థాయి ఉత్తమ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ)గా అవార్డు పొందిన ఎం వెంకట రామారావును వివిధ ప్రభుత్వ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది అభినందించారు. స్థానిక ఏడీఏ వెంకటరామారావు ఆదివారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బీ కృష్ణారావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ చేతులు మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సబ్ డివిజన్‌లో మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది, స్థానిక కార్యాలయం కాంపౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అభినందనలు తెలియచేశారు.

రహదారి భద్రతా, నియమాలపై అవగాహన

రావులపాలెం: డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో రహదారి భద్రత నియమాలపై అవగాహన పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని ఎంవీఐ వి శ్రీనివాస్ అన్నారు. స్థానిక అవంతి ఫిషరీస్ కంపెనీలో సోమవారం 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాత్రిపూట, మంచు కురిసే సమయంలో తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లు తగిన మెళకువలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.షణ్ముఖి, నెక్కంటి, అవంతి కంపెనీల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో భాగంగా ఏర్పాటు చేయనున్న డిజిటల్ లైబ్రరీకి పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ డిజిటల్ లైబ్రరీ నిర్మాణంకు కేంద్ర ప్రభుత్వం 23.10 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ డిజిటల్ గ్రంథాలయంలో ఇంటర్నెట్, కంప్యూటర్స్ లాంటి సౌకర్యాలతో అధునాతనంగా రూపుదిద్దుకుంటుందన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరారావు, స్థానిక సర్పంచ్ కుడిపూడి శాంతావతి, ఎంపీటీసీ సభ్యులు యడ్ల కిరణ్‌బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న భారత్

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ అన్నారు. బెల్లంపూడి గ్రామంలో సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ అధ్యక్షతన సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేమా, పవన్‌లను సత్యనారాయణ సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరరావు, రంగసాయి, సూర్యనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాటాలు చేసిన వ్యక్తి అంబేడ్కర్

మామిడికుదురు: కుల ఆధిపత్య నిర్మూలనకు భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బీఆర్ అంబేడ్కర్ ఎన్నో పోరాటలు చేశారని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బీసీ సామాజిక భవనంలో సోమవారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ రాజ్యాంగ సమ్మాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారత మాత, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, నక్కా త్రిలోచనరావు, మెండా ఆదినారాయణ, వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి గంగాధరం, కోటపల్లి సాయిబాబు, యాండ్ర అబ్బాస్, సుంకర నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల నిరసన



రాజోలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కల్లుగీత కార్మికులు

రాజోలు: రాజోలు నియోజకవర్గంలో కల్లుగీత కార్మికులకు మద్యం షాపు కేటాయించాలని కోరుతూ కల్లుగీత కార్మిక సహకార సంఘ సభ్యులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలోని రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో మొత్తం 36 సొసైటీలు ఉన్నాయన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రాజోలు నియోజకవర్గంలో ఒక్క మద్యం షాపు కూడా గీత కార్మిక సంఘాలకు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా కల్లుగీత కార్మిక సహకార సంఘాలు తీవ్ర నిరాశకు గురయ్యాయని వాపోయారు. రాజోలు నియోజకవర్గంలో మండలానికి ఒక మద్యం షాపును కల్లుగీత కార్మిక సహకార సంఘానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు కామన చంద్రరావు, కడలి నాగేశ్వరరావు, పాటి వీర వెంకట సత్యనారాయణ, కాగితపు వెంకటేశ్వరరావు, చప్పిడి రామదాసు, కడలి సాయిబాబు, గుబ్బల కోటేశ్వరరావు, పెచ్చెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పదో తరగతి స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

రాజోలు: కాట్రేనిపాడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న సర్పంచ్ అడబాల శ్రీనివాసరావు కుమారుడు అడబాల నారాయణ తేజ ఆర్థిక సహకారంతో యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని సర్పంచ్ శ్రీనివాసరావు అన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఆరేటి త్రిమూర్తులు, యూటీఎఫ్ నాయకులు కె.రాజబాబు, కేవీఎస్ఎన్ బాబు, గంగుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాల సీజ్



ఆలమూరు పోలీసుస్టేషన్‌లో ఇసుకను తరలిస్తున్న వాహనాలు

ఆలమూరు: జొన్నాడ ఇసుక ర్యాంపులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు వాహనాలను ఆలమూరు పోలీసులు సీజ్ చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక ఇసుక ర్యాంపులో అనుమతి లేకుండా ఇసుకను తవ్వుతున్నారనే సమాచారంతో ఎస్సై ఎం.అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇసుకను తవ్వుతున్న ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసును కూటమి నాయకులు నీరుగార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఇసుక మాయం

జొన్నాడ ఏటిగట్టు సమీపంలో సీజ్ చేసిన ఇసుక గుట్టలు మాయమయ్యాయి. జిల్లా మైన్స్ అధికారులు ఆదేశాల మేరకు గత నెలలో రెవెన్యూ సిబ్బందిని పహరా ఉంచినా ఫలితం లేకపోయింది. సుమారు పంట టన్నుల ఇసుకను అక్రమార్కులు తరలించుకుపోయినట్లు ఈ మేరకు తహసీల్దార్ కె.జె.ప్రకాష్‌బాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.